# వడగాలులలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి – జిల్లా కలెక్టర్



**వరంగల్, వుదయం:**

వేసవిలో వడగాల్పులతో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద కలెక్టరేట్ అధికారులను ఆదేశించారు. సోమవారం రోజున కలెక్టరేట్లో వేసవి వడగాల్పుల కార్యాచరణ ప్రణాళిక–2026పై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శాఖ తమ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. తాగునీటి సరఫరా, వైద్య సేవలు, విద్యుత్, పశుసంవర్ధక, మున్సిపల్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.హీట్ వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అవసరమైన చోట నీడ ఏర్పాట్లు, చలువేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీటి సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) గణేష్, జెడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతలవి కపట ప్రేమలు

## కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతి రెడ్డి

**నల్లబెల్లి, వుదయం:**



గత పదేళ్ల పాలనలో రైతులను వంచించిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు ధర్నాల పేరుతో నాటకమాడుతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రంగయ్య చెరువు రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించాలని సంకల్పిస్తే.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ–డిజైన్ పేరుతో ఆ ప్రాజెక్టును రద్దు చేసి రైతులకు అన్యాయం చేసింది.గతంలో కాల్వల్లో పూడిక తీయక 300 ఎకరాలు ఎండిపోవడానికి కారణమైన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, నేడు కాల్వల వద్ద ఫోటోలకు ఫోజులివ్వడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. దొంతి మాధవ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రెండు విడతలుగా కాల్వల్లో పూడిక తీయించి, చివరి ఆయకట్టు వరకు నీరందించారని గుర్తుచేశారు.

అధికారం పోగానే రైతులపై కపట ప్రేమ కురిపిస్తున్న బీఆర్ఎస్ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, మాజీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘుపతి రావు, మాలోత్ చరణ్ సింగ్, జెట్టి రామ్మూర్తి, సర్పంచ్‌లు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మక్కలు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**శాయంపేట, వుదయం**



మార్క్ ఫెడ్ వారి సౌజన్యంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపాల్ పల్లి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే 30 లక్షల టన్నుల మక్కాలో కేవలం 8 లక్షల టన్నులకే కొనుగోలు అనుమతి ఇవ్వడం రైతులకు అన్యాయం అని విమర్శించారు మిగతా 22 లక్షల టన్నుల కొనుగోలును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులకు నష్టం కలగకుండా క్వింటాల్కు రూ 1000 వరకు భారం తీసుకుంటూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.

# అభివృద్ధి లక్ష్యంగా నిధుల మంజూరు చిట్యాల తిరుపతిరెడ్డి

## కొండాపురంలో సిసి రోడ్డు పనుల ప్రారంభం



**నల్లబెల్లి, వుదయం:**

మండలంలోని కొండాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) నిధులతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి ప్రారంభించారు. స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి సహకారంతో ఈ నిధులు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడమే లక్ష్యమని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, ప్రధాన కార్యదర్శి మాలోతు మోహన్, గ్రామ సర్పంచ్ అబ్బరబోయిన లలిత సురేష్, నందిగామ సర్పంచ్ భూక్య భాస్కర్. కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఏదాకుల సంపత్ రెడ్డి, జెట్టి రామ్మూర్తి, జిల్లా మునీందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండ నారాయణ, ఉపసర్పంచ్ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు పోగుల కుమారస్వామి, కల్తీ సాంబయ్య, కొమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువత సన్మార్గంలో నడవాలి..

## బీజేపీ మండల అధ్యక్షుడు రాధారపు అశోక్



**ఖానాపురం, వుదయం:**

యువత పెడదారి పట్టకుండా సన్మార్గంలో నడవాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు రాధారపు అశోక్ యువతకు పిలుపునిచ్చారు. మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన యువకులు రాత్రి సమయంలో ఆడుకోవడానికి వాలీబాల్ లేదని కొంతమంది యువకులు బిజెపి మండల అధ్యక్షుడికి తెలపడంతో వెంటనే యువకుల కోరిక మేరకు స్పందించి నూతన వాలీబాల్ ను కొని యువతకు అందజేశారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి బిజెపి మండల అధ్యక్షుడు మాట్లాడుతూ యువత చెడు మార్గాలకు బానిస కాకుండా దూరంగా ఉండాలని గ్రామ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని యువతకు పిలుపునిచ్చారు. యువకుల కోరిక మేరకు వెంటనే స్పందించి వాలీబాల్ ను అందజేసిన బిజెపి మండల అధ్యక్షుడికి గ్రామ యువకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపావత్ రఘు, పెండ్యాల రాజు, అన్నేబోయిన రాకేష్, బొమ్మెరబోయిన రమేష్, బొమ్మెరబోయిన ప్రశాంత్, కుందనపల్లి వినయ్, రాము, శ్రవణ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ లుగా నియామకంపై హర్షం

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ లుగా మహాదేవపూర్ మండలానికి చెందిన నాయకులు నియామకం కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు దేవదాయ శాఖ నుండి కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం డైరెక్టర్లుగా నియమిచ్చినట్లు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది దానికో భాగంగా అన్నారం గ్రామం మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దళిత సంఘం సీనియర్ నాయకుడు మంచినీళ్ళ దుర్గయ్య తో పాటుకుదురుపల్లి గ్రామంలో ఆర్ఎంపి పిఎంపిగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ మాజీ ఉపసర్పంచ్ సేవలందించిన దొడ్ల అశోక్ లను కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్లుగా నియామకం కావడంతో మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల తోపాటు దళిత సంఘాలనాయకులు ఆర్.ఎం.పి పిఎంపి సంఘం నాయకులు తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు నూతనంగా నియమితులైన దేవస్థానం డైరెక్టర్ లు మంచినీళ్ళ దుర్గయ్య, దొడ్ల అశోక్ మాట్లాడుతూ తమపై నమ్మకముంచి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారికీ సేవలందించే అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు కు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు కు స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎంపేడులో పౌరహక్కుల దినోత్సవం

**టేకుమట్ల, వుదయం:**



మండలంలోని ఎంపేడు గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ ఇసంపల్లి హారిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్ఐ సంతోష్ హాజరై మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, ముఖ్యంగా బలహీన వర్గాలు తమ హక్కులను తెలుసుకుని వినియోగించుకోవాలని సూచించారు. సమాజంలో ఇంకా కనిపించే అంటరానితనం వంటి సామాజిక సమస్యలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరూ సమానత్వంతో జీవించే సమాజ నిర్మాణమే లక్ష్యమని తెలిపారు.అలాగే షెడ్యూల్డ్ కులాలు, తెగలసంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై గ్రామస్తులకు వివరించారు. ఆర్థిక, విద్యా, సామాజిక రంగాల్లో ఈ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అకాల వర్షం మొక్కజొన్న రైతులకు నష్టం



**టేకుమట్ల, వుదయం:**

మండల కేంద్రంలోని పలు గ్రామాల్లోని రైతులకు వర్షంతో పంట నష్టం వాటిల్లింది. రామకృష్ణాపూర్ (వి) గ్రామానికి చెందిన రైతు మంచాల రాకేష్ తన కున్న నాలుగు ఎకరాల లో మొక్కజొన్న సాగు చేశారు. పంట చేతికి వచ్చే దశలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సోమవారం రాత్రి కురిసిన వర్షం, దానికి తోడైన ఈదురు గాలుల వల్ల సుమారు రెండు ఎకరాల్లో ఉన్న పంట పూర్తిగా నేలమట్టమైంది. నేలకొరిగిన మొక్కలను చూసి రైతు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పర్యటించి, నష్టపోయిన ప్రతి ఎకరాకు తగిన పరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధితుడు రాకేష్ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి పంట నష్టం అంచనా వేయాలని తోటి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి వరం..

## సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు..



**రాయపర్తి, వుదయం**

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి షాదీముబారక్ పథకం వరమని స్థానిక శాసన సభ్యురాలు మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రైతు వేదిక భవనంలో గ్రామ సర్పంచ్ గారే సంహేద్ర బిక్షపతి అధ్యక్షత వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్వినిరెడ్డి విచ్చేసి అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 48 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.48,05,568 విలువైన కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కులను , రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్లల వివాహాల సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాల లబ్ధి అందేలా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని వారు పేర్కొన్నారు. రైతుల కష్టం తగ్గించేందుకు వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందినందుకు ఆధునిక యంత్ర పరికరాలను వినియోగం ఎంతో అవసరమని తెలిపారు. వ్యవసాయ రంగానికి అభివృద్ధి పరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం రైతులకు అవసరమైన సదుపాయాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఏవో గుమ్మడి వీరభద్రం, ఎంపీఓ ప్రకాష్, సర్పంచులు తీగల సాయిలు, రాయిని యాకన్న, చిర్ర వేణు, కందికట్ల స్వప్న సంతోష్, చెవ్వు హేమలత కాశినాదం, పెండ్లి మహేందర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు ఈదుల కంటి రవీందర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి కాంచనపల్లి వనజారని, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభం..

## ఇందిరమ్మ ఇళ్లపేదింటి కల నెరవేరింది...

## నూతన గ్రామ పంచాయతీకి శంకుస్థాపన...

## శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి...

**రాయపర్తి వుదయం:**

మండలం వెంకటేశ్వరపల్లి గ్రామంలో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని, ఈ గ్రామానికి చెందిన ఇంతలా రామ చిరంజీవి దంపతుల



ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ గృహ ప్రవేశ వేడుకలు స్థానిక సర్పంచ్ సారయ్య తో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ప్రారంభించారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం ఆధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ భవనం ద్వారా గ్రామ పాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి పంచాయతీ భవనం ఒక కేంద్రంగా మారి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు త్వరితగతిన అందేలా చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక సంస్థలు బలోపేతం కావడం ఎంతో అవసరమని, ఇందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు స్పష్టం చేశారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వం ప్రధాన లక్షణం అని తెలిపారు. ప్రతి ఒక్కరికి సురక్షితమైన నివాసం ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని వారు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి పంచాయతీ భవనం చిలక పాత్ర పోషిస్తుందని తెలిపారు గ్రామ ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు ఒకేచోట అందుబాటులోకి రావడానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామస్థాయిలో పరిపాలనను బలోపేతనం చేయడం ద్వారా ప్రజలకు మరింత సేవలు అందించగలుగుతామని వారు తెలిపారు. అలాగే గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాష్,పీఆర్ఏఈ శ్రీప్రియ, ఐటీడీఏ అధికారి, సర్పంచులు బానోత్ బుల్లి, చెవ్వు హేమలత కాశినాదం, పెండ్లి మహేందర్ రెడ్డి, భూక్య శ్రీలత సమ్మయ్య, మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, ఎస్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఇల్లందుల భగవాన్, చిన్నపాక ఎల్లయ్య, యూత్ అధ్యక్షులు బొమ్మెర కళ్యాణ్ గౌడ్, తీరని ప్రవీణ్, చేగొండ సాయి గౌడ్, పంచాయతీ కార్యదర్శులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నూనె పదార్థాలను తగ్గించి సిరి ధాన్యాలను ఎక్కువ తీసుకోవాలి

## ఐసిడిఎస్ సూపర్వైజర్ రమా

**ఖానాపురం, వుదయం:**



అంగన్వాడి పిల్లల తల్లులకు గర్భిణీ స్త్రీలు బాలింతలు నూనె పదార్థాలను తగ్గించి సిరి ధాన్యాల వైపు ఎక్కువగా దృష్టి మళ్లించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ రామా తెలిపారు. మంగళవారిపేట సెక్టార్ పరిధిలోని ధర్మరావుపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలోని ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు అన్న ప్రసన్నాలు నిర్వహించి బాలామృతం, పౌష్టికాహారంపై అంగన్వాడి సూపర్వైజర్ అంగన్వాడి పిల్లల తల్లులకు బాలింతలకు గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పిస్తూ, నూనె పదార్థాలను తక్కువ తీసుకొని సిరి ధాన్యలు పెసలు, శనిగలలాంటివి ఎక్కువ తీసుకోని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ రాణి, మంజుల, ఐలమ్మ, శాంత, ఆయాలు పిల్లల తల్లులు గర్భిణీ స్త్రీలు బాలింతలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన సర్పంచ్ రాణి

**ఖానాపురం, వుదయం:**




పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఎంతగానో ఉపయోగపడతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పెసరు రాణి లబ్ధిదారులకు తెలిపారు. మండలంలోని బుధరావుపేట గ్రామంలోని నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గ్రామ సర్పంచ్ పాల్గొని నూతన ఇంటి లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు లింగిడి. వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్, మండల ప్రధాన కార్యదర్శి ఎస్కే లాల్ సాహెబ్, ప్రచార కార్యదర్శి పసునూరి వెంకన్న, బ్లాక్ నాయకుడు గిరగాని నరసయ్య, నాయకులు దేవినేని వేణుగోపాల్ రావు, చెడిపాక యాకయ్య, కోడి మల్లేష్, కమ్మంపాటి ప్రకాష్, రవికుమార్, వల్లెపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను వెంటనే అమలు చేయాలి..

## ఆశా కార్యకర్తల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి..

## తాహసిల్దార్ కార్యాలయం, ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిరసన వినతి పత్రం..

**ఖానాపురం, వుదయం:**



ఆశా కార్యకర్తలకు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను వెంటనే అమలు చేసి ఆశా కార్యకర్తల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలంగాణగ్రామీణ ఆశావర్కర్స్ యూనియన్ బిఆర్ టియు జిల్లా అధ్యక్షుడు గోన యువరాజు, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ఆశా వర్కర్లతో బిఆర్ టియు, బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు ముఖ్య నాయకులతో కలిసి హనుమాన్ బస్టాండ్ నుండి క్రింది బస్టాండ్ మీదుగా తహసిల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం రెండు కార్యాలయల ముందు ధర్నా చేసి నిరసన వ్యక్తం చేసి తాహసిల్దార్ నంగునూరి రమేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ జ్యోతిల కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 19 రోజుల నుండి ఆశా వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రజా స్వామ్య పద్ధతిలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ యంత్రాంగంతో ఉక్కు పాదం మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన నెలకు ఆశా కార్యకర్తలకు 18 వేల రూపాయల వేతనం వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వము సానుకూలంగా పరిష్కరించకుంటే బిఆర్టియు ఆధ్వర్యంలో మరింత ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి రమేష్,ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత, ఆశ యూనియన్ మండల అధ్యక్షురాలు తడుగుల సంధ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆబోతు అశోక్ యాదవ్, జాటోత్ సదర్ లాల్, ఎస్.కె మౌలానా, ఎస్.కె అల్లావుద్దీన్ ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గాలికుంటు వ్యాధికి టీకాలు

**టేకుమట్ల, వుదయం:**



సోమనపల్లి గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. టేకుమట్ల మండల పశు ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమ ఉమా పాల్గొని సర్పంచ్ మాట్లాడుతూ.. పశువులను వ్యాధుల నుండి రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మూడు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో ఉన్న 103 పశువులకు టీకాలు వేయడం జరిగిందని డాక్టర్ వివేక్ తెలిపారు.

# నేరాల నియంత్రణకు కఠిన చర్యలు– వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశం



**వరంగల్ క్రైం, వుదయం:**

కమిషనరేట్ పరిధిలో అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను మరింత పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాల వేదికగా జరిగిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఇసుక అక్రమ రవాణా, గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం దందాలను అరికట్టడానికి ప్రతి స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘా ఉంచాలి. కేవలం వినియోగదారులను పట్టుకోవడమే కాకుండా, గంజాయి సరఫరా చేసే మూలాలను గుర్తించి నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయాలి. పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించాలని, పాత నేరస్తులపై హిస్టరీ షీట్లు తెరవాలని సూచించారు. కాలనీల్లో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటినిజియో ట్యాగింగ్ కు అనుసంధానించాలని ఆదేశించారు.' ఆరైవ్ – ఆలైవ్' కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రాబోయే హనుమాన్ జయంతి వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్కుమార్, రాజమహేంద్ర నాయక్, కవిత, ఏఎస్పీ చేతన్, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రాతో పాటు పలు వురు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

